నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, సోమవారం 7 ఏప్రిల్ 2025 SANGAREDDY


# కేసీఆర్ చలవతోనే సాగునీళ్లు



పోతారంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దంపతులు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఏప్రిల్ 6: కేసీఆర్ చలవతోనే దుబ్బాక నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, తన సొంతూరు పోతారం చెరువుకు శ్రీరామనవమి రోజున కాల్వల ద్వారా సాగునీళ్లు రావడం చాలా సంతోషంగా ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తన సొంతూరుకు సాగునీళ్లు రావాలని గత శ్రీరామనవమి రోజు భగవంతుడికి వేడుకున్నానని, అతడి ఆశీస్సులతో శ్రీరామనవమి రోజునే గ్రామానికి సాగునీళ్లు వచ్చాయని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. శ్రీరాముడి ఆశీస్సులు, కేసీఆర్ సహాయ సహకారాలతోనే దుబ్బాక నియోజకవర్గం సాగునీటి వెతలు తీరుతున్నట్లు తెలిపారు. 4ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాల్వల ద్వారా దుబ్బాక మీదుగా పోతారం పెద్ద చెరువులోకి ఆదివారం జలాలు రావడంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రైతులు సన్మానించారు. ఏడాదిగా పోరాడితే తమ గ్రామానికి గోదావరి నీళ్లు వచ్చాయని, వచ్చే శ్రీరామనవమి నాటికి దుబ్బాక నియోజకవర్గంలో అన్ని ఉప కాల్వలు నిర్మాణం జరిగి, రైతులందరికీ సాగునీరు అందాలని దేవుడికి మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

**వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం..**

దుబ్బాక నియోజకవర్గంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామం పోతారంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. 23 ఏండ్లుగా పోతారంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దంపతులు సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆదివారం గ్రామంలోని హనుమాన్ దేవాలయం వద్ద సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం యాగంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, అంజిరెడ్డి, నరేశ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. దుబ్బాక పట్టణంలో బాలాజీ దేవాలయంలో , హనుమాన్ దేవాలయంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట, లచ్చపేటలో, దుబ్బాక మండలంలో గంభీర్‌పూర్, రాజక్కపేట, ఆకారం, పెద్దగుండవెల్లి తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.



పోతారం చెరువులో చేరిన జలాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# ఉపాధి కోల్పోతున్న వారిని ఆదుకోవాలి



వట్‌పల్లిలో ఇండ్లు, దుకాణాలు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

- మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

వట్‌పల్లి, ఏప్రిల్ 6 : సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో రోడ్డు విస్తీర్ణ పనులతో ఉపాధి కోల్పోతున్న స్థానికులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. ఆదివారం వట్‌పల్లిలో ఆయన పర్యటించారు. రోడ్డు విస్తరణతో ఇండ్లు, దుకాణాలు కోల్పోతున్న బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అభివృద్ధి జరగడం అందరికీ అవసరమేనని, కానీ.. ఉపాధి కోల్పోతున్న వారికి అండగా నిలవాలన్నారు. రోడ్డు విస్తరణ, డివైడర్ల ఏర్పాటుతో 60 ఏండ్లుగా రోడ్డు పక్కల ఉపాధి పొందుతున్న కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నాయని, వారికి ప్రభుత్వం జీవనోపాధి చూపాలన్నారు.వారిని రోడ్డున పడేసి వదిలేస్తామంటే సరికాదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే డివైడర్ నిర్మించాలని అనుకున్నామని, స్థానికులు ఉపాధి కోల్పోతారనే ఉద్దేశంతో విరమించుకున్నటు క్రాంతికిరణ్ తెలిపారు. ఈ విషయం ఇక్కడి ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఇదే విషయంపై వారం క్రితం మంత్రి దామోదర రాజనర్సింహ వద్దకు బాధితులు వెళ్లగా, ఆయన ఆగ్రహంతో తిట్టి పంపించారని బాధితులు కన్నీళ్లు పెట్టుకోవడంతో వారిని ఓదార్చి ధైర్యం చెప్పానన్నారు. మంత్రి అలా వ్యవహరించడం తగదన్నారు. తమ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన రోడ్లను నేటికి ఈ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. కానీ, ఇప్పుడు కొత్తగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ, హడావిడి చేస్తున్నారని విమర్శించారు.



బాధితుడిని ఓదారుస్తున్న క్రాంతికిరణ్

# కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

## కాలువలు నిర్మించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది..

- రైతులే డబ్బులు వెచ్చించి కాలువ తవ్వుకుంటున్నారు..
- పొలాలు ఎండుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదు..
- రిజర్వాయర్లలో నీళ్లున్నా పంపింగ్ చేయడం లేదు..
- కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం కక్ష
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- సొంత డబ్బులతో తవ్వించి నీళ్లు అందజేసిన హరీశ్‌రావు



చౌడారంలో పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేస్తున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఏప్రిల్ 6: కాంగ్రెస్ ప్రభుత్వ తీరుతో రైతులకు సాగునీరు అందడం లేదని, కనీసం కాలువలు నిర్మించలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై వివక్ష చూపుతున్నదని, ఈ మెగా ప్రాజెక్టును కక్షపూరితంగా ఎండబెడుతున్నదని ఆయన ఆరోపించారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం కాలువ నుంచి మైలారం జాలి చెరువు బిక్కబండ కుంటకు సొంత డబ్బులు వెచ్చించి హరీశ్‌రావు ఇటీవల కాలువ తవ్వించారు. ఆదివారం రైతుల సమక్షంలో పైప్‌లైన్ ద్వారా చెరువులోకి ఆయన నీటిని విడుదల చేశారు. దీంతో రైతులు ఎంతో సంతోషంతో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మైలారం జాలిచెరువు, కొండెంగులకుంట, బిక్కబండ రైతులకు నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని ఇటీవల తనతో మొరపెట్టుకున్నారని, పంటలు ఎండిపోవద్దనే ఉద్దేశంతో తన సొంత డబ్బులతో కాలువ పనులు చేయించానని, భూసేకరణలో నష్టపోతున్న రైతులకు పరిహారం ఇచ్చి కాలువ పనులు చేసినట్లు తెలిపారు. కండ్ల ముందు పంటలు ఎండుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టడం లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం పూర్తిగా కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. పిల్ల కాలువలు తవ్వితే ఆయకట్టు పెరుగుతుందని, రైతులకు సాగునీరు అందుతుందని, భూసేకరణ కోసం నిధులు విడుదల చేయాలని శనివారం నీటిపారుదల శాఖ ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేసినట్లు హరీశ్‌రావు తెలిపారు. అసెంబ్లీలో కట్ మోషన్ ఇచ్చి నిరసన తెలిపామన్నారు. అన్ని రకాలుగా ప్రభుత్వాన్ని నిద్ర లేపే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉత్తర తెలంగాణకు వరప్రదాయిని అన్నారు. కాళేశ్వరం నీళ్లు ఉండబట్టే కోకాకోలా ఫ్యాక్టరీ వచ్చినట్టు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని, ప్రభుత్వం ఆలస్యం చేయకుండా కుంగిన ఒకటో రెండో పిల్లర్లను మరమ్మతులు చేసి నీళ్లు ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. కాంగ్రెస్ వచ్చాక ఖమ్మంలోని పెద్దవాగు, సుంకిశాల, ఎస్‌ఎల్‌బీసీ సొరంగం, వట్టెం ప్రాజెక్టులు కూలియినట్లు గుర్తు చేశారు. కాళేశ్వరం అంటే మెగా ప్రాజెక్టు అన్నారు. కాళేశ్వరం ద్వారా సిద్దిపేట నియోజకవర్గంలో 52 వేల ఎకరాలకు నీళ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ఇది కేసీఆర్ చేసిన పుణ్యం అన్నారు. హైదరాబాద్‌లో కూర్చొని కాళేశ్వరం కూలిందని చెప్పడం సరి కాదన్నారు. సిద్దిపేటనే కాకుండా అనేక నియోజకవర్గాలకు కాళేశ్వరం నీళ్లు అందుతాయని తెలిపారు. ఇప్పటికైనా గోబెల్స్ ప్రచారం ఆపి భూసేకరణ చేసి కాలువలు తవ్వి రైతాంగానికి నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు హరీశ్‌రావు తెలిపారు. రంగనాయక సాగర్, కొండపోచమ్మ, మిడ్ మానేరులో నీళ్లు ఉన్నా విడుదల చేయడం లేదన్నారు. కేసీఆర్ కాళేశ్వరం మెగా ప్రాజెక్టు కట్టి, సిస్టం అంతా రెడీ చేసినట్లు తెలిపారు. పంపుహౌస్‌లు, రిజర్వాయర్లు, సబ్ స్టేషన్లు, మెయిన్ కెనాల్స్, డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ అన్నీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కేవలం భూసేకరణ చేసి కాలువలు తవ్వి రైతులకు నీళ్లు ఇవ్వాల్సి ఉండగా, అది మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని మండిపడ్డారు. ఏడాది కాలంలో ఒక్క ఎకరా కాళేశ్వరం ప్రాజెక్టు కింద భూసేకరణ చేయకపోవడంతో చాలా చోట్ల రైతులు సొంత డబ్బులు పెట్టుకొని రైతులే స్వచ్ఛందంగా కాలువలు తవ్వుకొని నీళ్లు తీసుకుంటున్న పరిస్థితి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కామిని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, పరకాల మల్లేశం గౌడ్, సత్యనారాయణ రెడ్డి, మేడికాయల వెంకటేశం, పోచబోయిన శ్రీహరి యాదవ్, పెట్టబోయిన శ్రీనివాస్, కాల్వ ఎల్లయ్య, ఏంరెడ్డి భూమిరెడ్డి, జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్ రెడ్డి, ముక్కెర శ్రీనివాస్, మొండయ్య, రైతులు పాల్గొన్నారు.

### మాకు నీళ్లిచ్చిన దేవుడు..



నీళ్లు రాకపోతయా అని వరి పంట వేసుకున్న. వరి గింజ దశకు రాగానే నీళ్లకు ఇబ్బంది ఎదురైంది. వరి పంట మీద ఆశలు వదులుకున్నం. కొన్ని రోజుల కిందట హరీశ్‌రావు సార్ మా ఊరికి ఏదో పనిమీద వచ్చిండు. మా గ్రామ పెద్దలతో కలిసి సారుకు జాలి చెరువు బిక్కబండ కొండకు నీళ్లు కావాలని లెటర్ రాసిచ్చినం. హరీశ్‌రావు సార్ ఏమన్నాడంటే, ఇప్పుడు మన గవర్నమెంట్ లేదు అని అన్నడు. మీరు ఏం రంది పడకుర్రి. నేను మీకు నీళ్లు ఇచ్చి తీరుతా అని మాట ఇచ్చిండు. ఆ సార్ సొంత డబ్బులు పెట్టి పైపులైన్ తవ్వించిండు. మా పంటలు ఎండిపోకుండా నీళ్లు ఇచ్చిండు. మాకు ఆయన దేవుడు అయ్యిండు.

–తంబాల కనకయ్య,రైతు, కమ్మర్లపల్లి

### హరీశ్‌రావుకు రుణపడి ఉన్నాం..



వాళ్ల గవర్నమెంట్ లేకున్నా మాకు నీళ్లు ఇయ్యాలని తాపత్రయంతో సొంత జేబులో నుంచి ఐదు లక్షల రూపాయలు పెట్టి పైప్‌లైన్ కాలువ తవ్వించి హరీశ్‌రావు సార్ మాకు నీళ్లు ఇచ్చిండు. వరి గింజ కాయ కొంటున్న సమయంలో మాకు నీళ్లు అందడం సంతోషం. రైతులంతా హరీశ్‌రావుకు రుణపడి ఉంటాం.

– రేగుల నరసయ్య, రైతు, కొండెంగలకుంట్ల



సిద్దిపేట రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# అందరిపై శ్రీరాముడి ఆశీస్సులు ఉండాలి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- శ్రీరామనవమి వేడుకలకు హాజరు.. పట్టువస్త్రాల సమర్పణ


సిద్దిపేట, ఏప్రిల్ 6: సీతారాముల ఆశీస్సులతో ఈ దేశం, రాష్ట్రం అభివృద్ధి వైపు పయనించాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేటలోని పలు ఆలయాల్లో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సిద్దిపేటలోని రామాయలంలో కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. లింగారెడ్డిపల్లిలో, సిద్దిపేట పారుపల్లి వీధిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు, పుస్తెమట్టెలు సమర్పించారు. సిద్దిపేట రేణుకా నగర్, పారుపల్లి వీధిలోని రామరాజు రావిచెట్టు హనుమాన్ దేవాలయం, గంజి హనుమాన్ దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవంలో, సిద్దిపేట పట్టణం నాసర్‌పురా హనుమాన్ దేవాలయంలో, ప్రశాంత్‌నగర్, సుభాష్ నగర్, సంతోష్ నగర్, వడ్డెర కాలనీ, రూరల్ పోలీస్ స్టేషన్, లెక్చరర్ కాలనీలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాముడి కృపతో ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాలకులు మంచి పాలన అందించేలా రాములవారు ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్‌రావు వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, నాయకులు పాల సాయిరామ్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



సిద్దిపేటలోని పారుపల్లివీధి రామాలయంలో ఉత్సవాలకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో రామాలయం గుడిలో కల్యాణ మహోత్సవం...



హాజరైన భక్తులు



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ నాటుకోళ్ల ఫామ్





ఫార్మోలిన్‌తో శానిటైజ్ చేస్తున్న రైతు శ్రీనివాస్‌గౌడ్

# బర్డ్‌ఫ్లూను జయించి.. లాభాలు ఆర్జించి

## వెటర్నరీ వైద్యుల సలహాలతో బయటపడ్డ పౌల్ట్రీ రైతు శ్రీనివాస్‌గౌడ్

- బయోసెక్యూరిటీ విధానంతో దరిదాపులకు రాని బర్డ్‌ఫ్లూ
- ఒక్క కోడి చనిపోకుండా లాభాల బాట
- రూ.7 లక్షల పెట్టుబడితో 3500 నాటుకోళ్ల పెంపకం
- తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోళ్లు చనిపోయినా శ్రీనివాస్‌గౌడ్ షెడ్డును తాకలేకపోయిన బర్డ్‌ఫ్లూ



రైతు శ్రీనివాస్‌గౌడ్

నర్సాపూర్, ఏప్రిల్ 6: బర్డ్‌ఫ్లూ మహమ్మారితో తెలుగు రాష్ట్రాల్లో లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ భయంకరమైన వ్యాధితో పౌల్ట్రీ రైతులు పూర్తిగా కుదేలయ్యారు. ఈ మాయరోగంతో కోళ్లు మృత్యువాత పడి భారీగా నష్టపోయారు. కానీ, ఓ పౌల్ట్రీ రైతు తను పాటించిన బయోసెక్యూరిటీతో ఒక్క కోడి కూడా చనిపోకుండా లాభాల బాట పట్టి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ బయోసెక్యూరిటీ పద్ధతులు పాటించి బర్డ్‌ఫ్లూను తట్టుకున్నాడు. తనకున్న 6 వేల పౌల్ట్రీ షెడ్డులో 9 ఏండ్లుగా బాయిలర్ కోళ్లను పెంచుతూ ఉపాధి పొందుతున్నాడు. కానీ, ఈసారి నాటుకోళ్ల పెంపకానికి ఆసక్తి కనబరిచాడు. అనుకున్నదే తడువుగా తనకున్న షెడ్డులో రూ.7 లక్షల పెట్టుబడి పెట్టి 3500 నాటుకోడి పిల్లలను తెచ్చాడు. నాటుకోళ్లు వేసిన కొన్ని రోజుల తర్వాత బర్డ్‌ఫ్లూ మహమ్మారి తెలుగు రాష్ట్రాల్లో పంజా విసిరి లక్షల కోళ్లను పొట్టన పెట్టుకుంది. తన షెడ్డుకు సమీపంలోని ఫామ్‌లో కోళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లోని కోళ్లు వరుసబెట్టి చనిపోవడం ప్రారంభించాయి. ఇది గమనించిన పౌల్ట్రీ రైతు శ్రీనివాస్ అధైర్యపడలేదు. వెటర్నరీ అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకుని కోళ్లు చనిపోకుండా జాగ్రత్తపడ్డాడు.

### బయోసెక్యూరిటీ విధానాన్ని పాటించి...

పౌల్ట్రీ రైతు శ్రీనివాస్‌గౌడ్ బయోసెక్యూరిటీ విధానాన్ని పాటించి ఒక్కటంటే ఒక్క కోడి చనిపోకుండా కోళ్లను పూర్తిస్థాయిలో కాపాడుకోగలిగాడు. ఈ బయోసెక్యూరిటీలో భాగంగా డ్రింకర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం, సమయానికి దాణా వేయడం, ట్యాంకర్‌ను శానిటేషన్ చేయడం, ట్యాంక్‌లో ఇన్నోసెంట్ ట్యాబ్లెట్లను వాడడం, పౌల్ట్రీ ఫామ్ చుట్టూ, పరిసరాల్లో ఫార్మోలిన్‌ను పిచికారీ చేయడం, లిట్టర్ కండీషన్ బాగుండేలా జాగ్రత్త పడడం, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకపోవడం, కుక్కలను దరిదాపులోకి రానివ్వకపోవడం, దాణా వాహనదారులకు, హమాలీలకు శానిటైజేషన్ చేసి అనుమతివ్వ డం, షెడ్డులో, చుట్టుపక్కల సున్నం, అల్లంవెల్లులి, బ్లీచింగ్ ఫౌడర్ పిచికారీ చేయడం ద్వారా ఎలాంటి క్రిమికీటకాలు షెడ్డులోకి రాకుండా అడ్డుకున్నాడు. దీంతో బర్డ్‌ఫ్లూ మహమ్మారి తన షెడ్డుకు రాలేకపోయింది. తాను, కుటుంబ సభ్యులు రెండు జతల చెప్పులను వాడుతూ ఓ జత ఆరుబయట, మరో జత పౌల్ట్రీఫామ్‌లో వాడుతూ ఎలాంటి క్రిములు చొరబడకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నాడు.

### సొంతంగా మార్కెటింగ్..

నాటుకోళ్లు కోత దశకు రాగానే ఎలా అమ్మాలో అనే ఆలోచనలో రైతు శ్రీనివాస్ గౌడ్ పడ్డాడు. ముందుగా తనకున్న సోషల్‌మీడియా యాప్‌ల ద్వారా రైతు శ్రీనివాస్‌గౌడ్, అతని కుమారులు నాటుకోళ్లు అమ్మబడుననే ప్రచారాన్ని వేగవంతం చేశారు. దీంతో చికెన్ సెంటర్ యజమానులు ముందుకు వచ్చి కోళ్లను కొంటామనడంతో బల్క్ మీద వారికి కిలోకి రూ. 230 నుంచి 240 వరకు విక్రయించారు. ఇతరులకు పుంజుకు రూ.400, పెట్టకు రూ.300 చొప్పును అమ్మారు. ఇలా 3500 కోళ్లకు 3000 కోళ్లను విక్రయించారు. ఇప్పటికే పెట్టుబడి పోను రూ.70 వేలు లాభం వచ్చిందని పౌల్ట్రీ రైతు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

### కంటికి రెప్పలా కాపాడిన..

నాటుకోళ్లు షెడ్‌కు తెచ్చిన నాటి నుంచి వాటిని కంటికి రెప్పలా కాపాడుకున్నా. రాత్రిపగలు దరిదాపులకు ఇతర మనుషులు కానీ, కుక్కలు రాకుండా జాగ్రత్తలు పాటించాం. నాటుకోళ్లు తెచ్చిన ఒకనెల అంతా బాగానే ఉంది. ఆ తర్వాత బర్డ్‌ఫ్లూ వచ్చి కోళ్లు చనిపోతున్నాయని తెలుగు రాష్ట్రాల్లో పుకార్లు లేచాయి. నా చుట్టు పక్కల గల ఫౌల్ట్రీ షెడ్లలో కోళ్లు చనిపోయి షెడ్లు పూర్తిగా కాలి అయ్యాయి. మొదట్లో నేను కూడా ఆందోళన చెందాను. వెటర్నరీ అధికారులను సంప్రదించి బయోసెక్యూరిటీ పద్ధతి పాటించాను. దీంతో నా షెడ్డుకు ఎలాంటి వైరస్ రాలేదు. కండ్లలో ఒత్తులు వేసుకొని కాపాడుకున్నా. కష్టపడితే లాభాలు ఎక్కడ పోవని నాకు తెలిసివచ్చింది.

– శ్రీనివాస్‌గౌడ్, పౌల్ట్రీ రైతు, బ్రాహ్మణపల్లి

# కల్యాణోత్సవంలో పాల్గొన్న వంటేరు



మనోహరాబాద్: కూచారంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

మనోహరాబాద్/తూప్రాన్, ఏప్రిల్ 6: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కూచారంలో నిర్వహించిన స్వామివారి కల్యాణోత్సవంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తూప్రాన్ మున్సిపల్ పరిధి పోతరాజ్‌పల్లిలో మాజీ ఎంపీటీసీ ఐలేష్ యాదవ్ నివాసంలో నిర్వహించిన మల్లన్న కల్యాణోత్సవంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేష్‌రెడ్డి దంపతులు, మాజీ చైర్‌పర్సన్ జ్యోతి, కౌన్సిలర్లతో పాటు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# కేతకీ ఆలయ పరిసరాలు కంపు కంపు

**దుర్గంధంతో భక్తుల తిప్పలు**



కేతకీ ఆలయం ఎదుట దుస్థితి

ఝరాసంగం, ఏప్రిల్ 6: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన సంగారెడ్డి జిల్లా ఝరాసంగం కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ పరిసరాలు కంపు కొడుతున్నాయి. ఆలయానికి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భారీగా భక్తులు, ప్రముఖులు దర్శనానికి వస్తుంటారు. ఈ క్షేత్రం పరిసరాల్లోని వాలాద్రి వాగు నుంచి వెలువడుతున్న దుర్వాసనతో భక్తులు ముక్కు మూసుకుంటున్నారు. ఆలయం ఎదుట శివపార్వతుల విగ్రహాల సమీపంలో చెత్తాచెదారం పేరుకుపోయింది. దోమలు, ఈగలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. భక్తులు పది నిమిషాలు ఉండలేని పరిస్థితులు ఉన్నాయి. ఊరి నుంచి ఆలయం వైపునకు వస్తున్న మురుగు వేరే వైపునకు మళ్లించేలా చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి రెగ్యులర్ ఈవో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల శని అమావాస్య రోజు మంత్రి దామోదర రాజనరసింహ ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు అధ్వానంగా ఉండడంతో సిబ్బందిపై ఆ యన అసహనం వ్యక్తం చేశారు. అయినా ఆల య పరిసరాలను శుభ్రం చేయడం లేదు. కాగా, నేడు జరిగే కేతకీ ఆలయ పాలక మండలి ప్రమాణాస్వీకార కార్యక్రమానికి మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ముఖ్యనాయకులు హాజరు కానున్నట్లు తెలిసింది. వారి రాకతో అయినా ఆలయ పరిసరాలు బాగుపడాలని భక్తులు ఆశపడుతున్నారు.



వాలాద్రి వాగులో పేరుకుపోయిన చెత్తాచెదారం